క్లుప్తంగా

భూమనకు శుభాకాంక్షలు..


భూమనకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కృపాలక్ష్మి

తిరుపతి మంగళం : నూతన సంవత్సరం సందర్భంగా వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డికి పార్టీ జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం తిరుపతి పద్మావతిపురంలోని భూమన నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

పరామర్శ


రంగమ్మకు నివాళి అర్పిస్తున్న కృపాలక్ష్మి

వెదురుకుప్పం : మండలంలోని డీఆర్‌ఎస్‌కండ్రిగకు చెందిన మాంబేడు మాజీ ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి పరామర్శించారు. సుబ్రహ్మణ్యం తల్లి రంగమ్మ గురువారం సాయంత్రం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రంగమ్మ మృతదేహానికి నివాళి అర్పించారు. ఆమె వెంట జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, స్థానిక సర్పంచ్ కవిత, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గురవారెడ్డి ఉన్నారు. అదే విధగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత ఆనగంటి హరికృష్ణ రంగమ్మ మృతదేహానికి నివాళి అర్పించారు. రాష్ట్ర కార్యదర్శి పేట దనంజయరెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, గురుస్వామి, వడివేలు, పరమేశ్వరరెడ్డి, రామచంద్రయ్య ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి


పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ గిరిజాప్రసాద్

పుత్తూరు: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వేపగుంట గ్రామ సర్పంచ్ గిరిజాప్రసాద్ గ్రామస్తులకు సూచించారు. శుక్రవారం వేపగుంట గ్రామం, హరిజనవాడలో పారిశుధ్య పనులను నిర్వహించారు. మురుగు కాలువల ఇరుపక్కల పెరిగిపోయిన పిచ్చిమొక్కలను, కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించారు. బ్లీచింగ్ చల్లి పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంకును శుభ్రపరిచారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రజలు సహకరించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికే సదస్సులు

శ్రీరంగరాజపురం : రైతులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న భూసమస్యలను పరిష్కరించడానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు లోకనాథపిళ్లై అన్నారు. మండలంలోని కోటార్లపల్లి, డి.కే.మర్రిపల్లి గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. రైతుల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సురేష్, ఆర్‌ఐ ప్రభాకర్ పాల్గొన్నారు.

పిచ్చిగుంట్లను ఆదుకుంటాం


మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ హిమవంశీ

గంగాధరనెల్లూరు: పిచ్చిగుంట్ల కుటుంబాలను ఆదుకుంటామని ట్రైనీ కలెక్టర్ హిమవంశీ అన్నారు. గంగాధర నెల్లూరు పంచాయతీ పరిధిలో పందులు మేపుకుంటూ జీవనం సాగిస్తున్న కుటుంబాలను ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డితో కలిసి పరిశీలించారు. పిచ్చిగుంట్ల ప్రజలతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు చంద్ర శేఖర్, అమల, కిరణ్‌కుమార్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్య కమిటీకి శిక్షణ

నగరి: మండల పరిధిలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్‌లకు, ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓలు శ్రీదేవి, నమశ్శివాయం శిక్షణా సమావేశాలను నిర్వహించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జరిగిన శిక్షణా సమావేశంలో అభివృద్ధి, ప్రణాళిక తయారీ, బాలల హక్కుల పరిరక్షణ గురించి వివరించారు.

ఉపాధ్యాయులకు సన్మానం


మహిళా ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

నగరి: మున్సిపల్ పరిధిలోని ఏకాంబరకుప్పం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయ్ పూలే జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను దుశ్శాలువాలతో సత్కరించారు. సావిత్రిబాయ్ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు.

అకాల వర్షాలు, చీడ పీడలతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రతి సంవత్సరం సాధారణంగా నవంబర్, డిసెంబర్‌లో మామిడి పూత వస్తుంది. ఇప్పటివరకు పూత రాకపోవడంతో మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఫిబ్రవరి, మార్చిలో పిందెలు ఏర్పడుతుంటాయి. ఏప్రిల్, మే నెలల్లో కాయలు కోతకు వస్తుంటాయి. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా గతేడాది తీవ్రంగా నష్టపోయిన మామిడి రైతులు.. ఈ సారి ఇంకా పూత రాకపోవడంతో నష్టాలు తప్పేలా లేవు.

జాడలేని మామిడి పూత


వడమాలపేటలో పూత లేని మామిడి తోట

- నేలలో పెరిగిన తేమ శాతం.. రైతుల్లో ఆందోళన
- ఎకరాకు రూ.40 వేలకు పైగా ఖర్చు
- పూత కోసం భగీరథ ప్రయత్నం

విజయపురం: వాతావరణంలో మార్పులు మామిడి రైతులకు శాపంగా మారింది. ఇటీవల తుపాన్ కారణంగా కురిసిన వర్షాలతో భూమిలో తేమ శాతం పెరిగింది. ఫలితంగా మామిడి చెట్లకు పూత రావడంలో ఆలస్యమవడంతో రైతులు కలవరపడుతున్నారు. సాధారణంగా నవంబర్, డిసెంబర్ నెలల్లో మామిడి పూత వచ్చి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో పిందెలు వచ్చేవి. కానీ డిసెంబర్ నెల ముగుస్తున్నా ఇంత వరకు పూత జాడ కనిపించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో మామిడి పూత కోసం రూ.లక్షలు వెచ్చించి రైతులు మందులను పిచికారీ చేయాల్సి వస్తుంది.

లక్షా 65 వేల హెక్టార్లలో తోటలు

మామిడి పంటపై రైతులు ప్రతి సంవత్సరం ఎన్నో ఆశలు పెట్టుకుంటూ ఉంటారు. జిల్లాలో సుమారు లక్షా 65 వేల హెక్టార్లలో రైతులు మామిడి సాగు చేస్తున్నారు. 21 మండలాల్లో మేజర్ క్రాప్ మామిడి ముందున్నది. ఇందులో 65 శాతం తోతాపురి సాగు చేస్తున్నారు. దీంతోపాటు నీలం, బేనీసా, ఖాదర్, మల్లిక, హిమా పసందు సాగులో ఉన్నాయి.

పూత కోసం రైతుల పాట్లు

మామిడి తోటల్లో అరకొరగా పూసిన పూత ఆపేందుకు ఓ వైపు, కొత్తగా పూత వచ్చేందుకు మరో వైపు రైతులు నానా పాట్లు పడుతున్నారు. దీనికి తోడు పూత రసం పీల్చే నల్లి, పూతను తొలిచే పురుగు మామిడిని ఆశించాయని రైతులు వాపోతున్నారు. ఎకరానికి రూ.40 నుంచి రూ.50 వేల చొప్పున ఖర్చు చేస్తూ మూడు దఫాలుగా మందులు స్ప్రే చేస్తున్నట్లు చెబుతున్నారు. ఆశించిన స్థాయిలో అనుకున్న సమయానికి పూత వస్తే ఎకరానికి 5 టన్నుల దిగుబడి లభిస్తుందంటున్నారు. కానీ ఇంత వరకు పూత దశ కనిపించపోవడంతో ఈ ఏడాది కూడా నష్టపోయే పరిస్థితి ఉంటుందని, ఇప్పటికే అప్పుల ఊబిలో ఉన్న రైతులు కోలుకోవడం కష్టమవుతుందని ఆవేదన చెందుతున్నారు.

అయితే వాతావరణ పరిస్థితుల వల్ల గతేడాది ఆశించిన స్థాయిలో దిగుబడి రాక మామిడి రైతులు ఆర్థికంగా చాలా నష్టపోయారు. ఈ ఏడాది ఆ నష్టాన్ని పూడ్చుకోవాలనే ఆలోచనలో ఉన్నా, వాతావరణ ప్రభావంతో ఇంత వరకు మామిడిలో పూత కనిపించకపోవడంతో ఈ ఏడాది కూడా రైతులు నిరాశ చెందుతున్నారు.

సలహాలు, సూచనలు ఎక్కడ?

పంటల సీజన్‌లో రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన ఉద్యాన వన శాఖ(హార్టికల్చర్) అధికారులు మామిడి తోటలను పట్టించుకోవడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. వచ్చిన పూత రాలకుండా, కొత్త పూత వచ్చేందుకు తీసుకోవాల్సిన సస్య రక్షణ చర్యలపై అధికారులు అవగాహన కల్పించాల్సి ఉన్నప్పటికీ జిల్లాలో ఆ దిశగా చర్యలు ఎక్కడా కనిపించడం లేదని, పొలం-పిలుస్తోంది కార్యక్రమాల్లో ఎక్కడ కాని హార్టికల్చర్ అధికారులు కనపించలేదని రైతులు చెబుతున్నారు. దీంతో రైతులే సొంతగా మందులు పిచ్చికారీ చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు మామిడి తోటలను సందర్శించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

ప్రతి ఏటా పూత ఆలస్యం

వాతావరణం ప్రభావంతో ప్రతి ఏటా పూత ఆలస్యంగా వస్తుంది. జనవరి మొదటి వారం వస్తున్నా.. ఇంత వరకు పూత జాడ కనిపించలేదు. గత ఏడాది కూడా ఆశించిన స్థాయిలో పూత, దిగుబడి లేక చాలా నష్టపోయాం. ఈ ఏడాది కూడా పూత రాకపోవడంతో ఆందోళనంగా ఉంది.

– సుబ్రమణ్యంనాయుడు, పాలసముద్రం

లక్ష రూపాయలకు మందులు కొట్టించా..



నాలుగు ఎకరాల మామిడి తోట సాగు చేస్తున్నా. ఇప్పటి వరకు పూత సరిగా రాలేదు. ఇప్పటికే లక్ష పెట్టి క్లోరిఫై పాస్, సాఫ్ పొడి, ప్లానోఫాస్, మందులను చెట్లకు కొట్టించా. గతేడాది అనుకున్న దిగుబడి రాలే.. ఈసారైనా లాభాలు వస్తాయనుకుంటే పూతే లేదు.

– శరత్, మల్లారెడ్డికండ్రిగ, విజయపురం

రైతులకు కష్టాలు తప్పవు



గత ఏడాదిలో దిగుబడి లేక చాలా నష్టపోయాం. ఈ ఏడాదైనా మంచి దిగుబడి వస్తే, అప్పులను తీర్చుకుంటామని అనుకున్నా. కానీ ఇంత వరకు పూత లేకపోవడంతో ఆందోళనగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి.

– సురేష్‌రాజు, వడమాలపేట

తేమ ఎక్కువగా ఉంది



ఇటీవల వరుసగా వచ్చిన తుపాన్ల కారణంగా తేమ ఎక్కువగా ఉంది. కొన్ని చోట్ల చెట్టు నిండా పూత వచ్చింది. వాతావరణ ప్రభావం కారణంగా పూత ఆలస్యం అయింది. మిగిలిన చోట్ల కూడా పూత వస్తుంది. రైతులు ఆందోళన పడవద్దు. పూత రాలేదని అధిక మొత్తంలో ఎరువు, మందులు వినియోగిస్తే ఖర్చు పెరుగుతుంది.

– లోకేష్, ఉద్యానవన శాఖాధికారి, విజయపురం

లక్షలు పెట్టి నిర్మించారు.. లక్షణంగా వదిలేశారు

- ప్రభుత్వ ధనం వృథా
- పశువులకు తప్పని నీటి గోస



వడమాలపేట: పశువులు తాగడానికి నీటిని అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన పశువుల నీటి తొట్టెలు పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో వృథా అవుతున్నాయి. చివరకు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. దీంతో ప్రభుత్వ ధనం వృథా అవుతుందని ప్రజలు వాపోతున్నారు. వడమాలపేట మండలంలో సుమారు 18 పశువుల నీటి తొట్టెను వివిధ పథకాల కింద లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించారు. కానీ నిర్మించిన లక్ష్యాన్ని మాత్రం మరిచిపోయారు. పశువుల దాహార్తి తీర్చడంతోపాటు అవసరమైతే ఆ తొట్టె వద్ద ఇతర అవసరాల కోసం ప్రజలు కూడా వినియోగించుకునేలా నీరు నింపడం లేదు. అంతేగాకుండా కొన్ని చోట్ల తొట్టెలో నీరు లేకపోవడంతో పగుళ్లీనుతున్నాయి. మరి కొన్ని చోట్ల తొట్టెలో వర్షపు నీరు నిలిచి పారిశుధ్యం లోపించింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో వృథాగా ఉంటున్న పశువుల నీటి తొట్టెలను వాడకంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సదస్సు వెలవెల


అర్జీల కోసం వేచి ఉన్న అధికారులు

పాలసముద్రం: మండలంలో ఎస్‌ఆర్‌ఆర్ కండ్రిగలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సు మొక్కుబడిగా నిర్వహించారు. రెవెన్యూ సదస్సు నిర్వహించి మధ్యాహ్నం అయినా రైతులు ఒక్కరూ తమ సమస్యను చెప్పుకునేందుకు రాలేదు. తహసీల్దార్ అరుణకుమారి భూ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన రెవెన్యూ సదస్సులో రైతులు లేక వెలవెలపోయింది. కేవలం నాయకులతో కలసి గ్రామ సభ మమ అనిపించారు. మధ్యాహ్నం పైగా వనదుర్గాపురం సచివాలయ పరిధిలో రెవెన్యూ సదస్సు జరిగింది. అక్కడ కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. కార్యక్రమంలో ఏఆర్‌ఐ దేవి, మండల సర్వేయర్ గణేష్ పాల్గొన్నారు.

సావిత్రిబాయి బాటలో నడుద్దాం




సావిత్రిబాయి పూలేకు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, కార్వేటినగరం : డీఎంపురం ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్‌ఎం కేశవులు, కత్తెరపల్లి ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పుత్తూరు: సమాజంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి తెలిపారు. శుక్రవారం కళాశాలలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా కళాశాల ఆవరణలోని సావిత్రిబాయి పూలే విగ్రహానికి మహిళా అధ్యాపకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే జయంతి రోజున మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా ఎక్కువ శాతం మహిళలు ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకోవడం ద్వారా బాలికల విద్యా వ్యాప్తి చెందిందని వివరించారు. సావిత్రిబాయి తన జీవితంలో ఎన్నో ఆటంకాలు ఎదురైనా బడుగు బలహీన వర్గాల వారికి విద్యను అందించిన ధీరోదాత్తురాలని కొనియాడారు. ఆమె ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వరయ్య, వీరయ్య, అధ్యాపకులు వాణిశ్రీ, సుజన, శ్రీదేవి, వాసవి, షర్మిల, దేవకి, పద్మావతి, సుజల, గాయత్రి, సావిత్రి, వరలక్ష్మీ, గౌరీ, వసంతకుమార్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శం

కార్వేటినగరం: స్త్రీ విద్య, సాధికారత కోసం జీవితాన్ని త్యాగం చేసిన సావిత్రిబాయి పూలే జీవితం నేటి మహిళలకు ఆదర్శమని డీఎంపురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కేశవులు అన్నారు. మండల పరిధిలోని డీఎం పురం ఉన్నత పాఠశాలలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులు హరిత, మాలతి, సుమతీలను పాఠశాల కమిటీ చైర్మన్ త్యాగరాజు సన్మానించారు. అదే విధంగా కత్తెరపలి, పాధిరికుప్పం, ఆర్కేఎస్సార్, కార్వేటి నగరం బాలికల ఉన్నత పాఠశాల, టీకేఎం పేట ఉన్నత పాఠశాలల్లో పూలే జయంతిని ఘనంగా జరుపుకున్నారు.


వెదురుకుప్పం : పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా చిత్రటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహిళా హక్కుల గురించి ప్రిన్సిపల్ అన్నపూర్ణశారద వివరించారు.

ఎరువుల వాడకంపై అవగాహన


మాట్లాడుతున్న ఇఫ్‌కో మేనేజర్

నగరి: ఎరువుల వాడకంపై రైతులకు ఇఫ్‌కో జిల్లా మేనేజరు మని చంద్రకుమార్ అవగాహన కల్పించారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక సహకార కేంద్రంలో ఇఫ్‌కో ఎరువుల విక్రయదారుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇఫ్‌కో జీవ ఎరువులు, రైజోబియం, బ్యాక్టీరియా, పోటాషియం మొబిలైజింగ్, జింక్ సాల్యుబులైజింగ్, ఎన్‌పీకే లిక్విడ్ కన్సార్టియా ఎరువులు ఏ విధంగా వాడలో రైతులకు అవగాహన ఏర్పారిచారు. అధిక దిగుబడులకు వరప్రదాయిని అయిన సాగరిక గోల్డ్ గుళికలు, ద్రవం ఎకరాకు పది కేజీల చొప్పున వాడాలని తెలిపారు. ఎరువులు కొనుగోలు చేసే సమయంలో సొసైటీలు, డీలర్ల వద్ద రశీదులు పొందాలన్నారు. ఇఫ్‌కో టోకియా గ్రామీణ వ్యక్తిగత ప్రమాద బీమా 'సంకటహరణ బీమా పథకం' ద్వారా ప్రమాదంలో మరణించిన వారికి రూ.2 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో సంఘ సీఈఓ తులసి పిళ్లై, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల నిరసన


పాఠశాల ఎదుట నిరసనలో తల్లిదండ్రులు

పాలసముద్రం: టీపీఎస్‌ఆర్‌పురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఎలా చదవాలని తల్లిదండ్రులు స్కూల్ ఎదుట శుక్రవారం నిరసన చేపట్టారు. పాఠశాలలో సుమారు 30 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలకు ఉపాధ్యాయుల కొరత ఉందని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ అమరావతి తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని కోరుతున్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ

కార్వేటినగరం: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్-1938 జిల్లా అధ్యక్షుడు కిరణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్కేఎస్సార్ ఉన్నత పాఠశాల ఆవరణంలో మండల విద్యాశాఖ అధికారులు విజయకుమార్, మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏపీటీఎఫ్ నాయకులు కలసి కాలమాన పట్టికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. అలాగే ఐఆర్, పీఆర్సీ కమిటీ వేయాలని, జీఓ నంబర్ 117ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కోటేశ్వరరావు, గాయత్రిదేవి, సునీత, ద్రాక్షాయణి, కేశవులు, నరేంద్ర, బాబు, ఫెడరేషన్ మండల అధ్యక్షుడు బాబు, ప్రధాన కార్యదర్శి కదిరివేలు, గౌరవ అధ్యక్షుడు ఆనందయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఆశాలకు ఇచ్చిన హామీ ఏమైంది

- కనీస వేతనం రూ.26 వేలు అమలు ఎప్పుడు
- ఉద్యోగ భద్రత ఊసే లేదు
- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కోదండయ్య
- ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చందామరై


మాట్లాడుతున్న కోదండయ్య

నగరి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆశాలకు వేతనాలు పెంచుతామని ఉద్యోగానికి భద్రత కల్పిస్తామని ఆశాల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిందని ఆ హామీ ఏమైందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చందామరై ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు విజయలక్ష్మి రూప అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. 18 సంవత్సరాలుగా గర్భవతులకు, బాలింతలకు, నవజాత శిశువులకు సేవలు అందిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న సంక్షేమ పథకాలను, ఆరోగ్య సూత్రాలను క్షేత్రస్థాయిలో సర్వేల రూపంలో ప్రజలకు అందుబాటులోకి తీసుకెళ్లి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక భూమిక పోషిస్తున్న ఆశా కార్యకర్తలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ధరలు విపరీతంగా పెరిగాయని దానికి అనుగుణంగా వేతనాలు రూ.26 వేలకు పెంచాలన్నారు. అధికారులు ఆశాలతో కేటాయించిన పనులనే చేయించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇచ్చి ప్రతి నెల పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలని, రూ.10 లక్షల ఉచిత ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సాధారణ సెలవులు, వేతనంతో కూడిన మెటర్నిటీ సెలవులు ఇవ్వాలని, రికార్డులను ప్రభుత్వం సరఫరా చేయాలని కోరారు. ఆశాలకు సంబంధం లేని రక్త పరీక్ష, గల్ల పరీక్ష, గల్ల సేకరణ పనులు చేయించరాదన్నారు. ఈ సమావేశంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజేశ్వరి, ఇంద్ర, పుష్ప, రేణుక, సుబ్బలక్ష్మి, జయప్రద పాల్గొన్నారు.

రేషన్‌కు పరేషాన్ !


అవస్థలు పడుతున్న ఆవలాపూర్ గ్రామస్తులు

గంగాధర నెల్లూరు: తమ గ్రామానికి రేషన్ షాపు మంజూరు చేయాలని ఆవలాపూర్ గ్రామానికి చెందిన ముస్లిం కుటుంబాలు డిమాండ్ చేశాయి. మండలంలోని ఆవలాపూర్ ముస్లిం కాలనీలో దాదాపు 250 రేషన్ కార్డులు ఉన్నాయని కానీ తమకు చింతారెడ్డిపల్లిలో రేషన్ షాపు కేటాయించారన్నారు. ఆ గ్రామానికి చెరువు ద్వారా దారిలో వెళితే 2 కి.మీ. దూరమేనని, ప్రస్తుతం చెరువు నిండిపోవడంతో చింతారెడ్డిపల్లి గ్రామానికి చేరుకోవడానికి 6 కిలోమీటర్లు చుట్టూ తిరిగి రావాల్సి వస్తోందని వాపోయారు.

ఉత్తమ సేవా ప్రశంసా పత్రం అందజేత


ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఎంఅండ్ హెచ్‌ఓ బాలకృష్ణ నాయక్

వడమాలపేట(విజయపురం): వడమాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ పనిచేస్తున్న వీరాస్వామి ఉత్తమ సేవా అవార్డుకు ఎంపికైనట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి బాలకృష్ణ నాయక్ తెలిపారు. శుక్రవారం వడమాలపేట ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ టెక్నీషియన్ వీరాస్వామి రోగుల రక్త పరీక్షల రిపోర్టులు సకాలంలో ఇస్తూ చురుగ్గా పని చేస్తున్నందుకు అభినందిస్తూ అవార్డు, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు చక్రపాణి, భానురేఖ, సీహెచ్‌ఓ పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.